సాక్షి
పెద్దపల్లి

ఆదివారం । 29 । సెప్టెంబర్ । 2024

న్యూస్‌రీల్

దొంగతుర్తిలో శాంతిహోమం



హోమంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం(ధర్మపురి): దొంగతుర్తిలోని శ్రీగోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శాంతిహోమం నిర్వహించారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ అశోక్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోగాల తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ వైరస్ సోకే ప్రమాదం



యాంటీ రేబిస్ టీకా వేస్తున్న పశువైద్యులు

పెద్దపల్లిరూరల్: కుక్కలు, పిల్లులు లాంటి పెంపుడు జంతువులతో మనుషులకు రేబిస్ వైరస్ సోకే ప్రమాదం ఉందని జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి శంకర్ అన్నారు. అంతర్జాతీయ రేబిస్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలో పెంపుడు కుక్కలకు శనివారం యాంటి రేబిస్ టీకాలను ఉచితంగా వేశారు. శ్రీసరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రేబిస్‌పై అవగాహన కల్పించారు. కుక్కకాటుకు గురైతే వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. డాక్టర్ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య ప్రణాళికల్లో రాణించాలి

పెద్దపల్లిరూరల్: విద్యార్థులు రెగ్యులర్ చదువుతోపాటు సహ పాఠ్యప్రణాళిక అంశాల్లోనూ రాణించాలని అకాడమిక్ మానిటరింగ్ ప్రోగ్రాం ఆ ఫీసర్ పీఎం షేక్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీలు ప్రారంభించి మాట్లాడారు. పల్లె ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మూఢనమ్మకాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటా రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో సృజనాత్మకతను పెంచేలా సైన్స్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు తెలిపారు. జిల్లాస్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో ఇచ్చిన ప్రదర్శనల్లో కాల్వశ్రీరాంపూర్ విద్యార్థినులు ప్రథమ, గట్టెపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతులు అందుకున్నారు. హెచ్ఎంలు జగదీశ్వర్‌రెడ్డి, కుమార్, యూసుఫ్, నాగరాజు, సృజన తదితరులు ఉన్నారు.

2న అథ్లెటిక్స్ పోటీలు

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో అక్టోబర్ 2వ తేదీన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ము గట్టయ్య శనివారం తెలిపారు. అండర్–14, 16, 18, 20లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి కె.సుదేశ్‌ను 94404 24640 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

ముగిసిన 'హ్యాకథాన్'పోటీలు

రామగిరి(మంథని): సెంటనరీకాలనీలోని మంథని జేఎన్టీయూలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాకథాన్ పోటీలు శనివారం ముగిశాయి. 84 మంది విద్యార్థులు 14 గ్రూపులుగా ఏర్పడి తమ ప్రాజెక్టుల ఆలోచనలను జ్యూరీలకు వివరించారు. 20 గంటలపాటు ఏకధాటిగా సాగిన పోటీల్లో విలువైన ఆలోచనలు వెల్లడించారు. జాతీయ స్థాయిలో జరిగే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలకు సన్నద్ధం కావడానికి, విద్యార్థులు తమ సృజనాత్మకత ప్రదర్శించడానికి ఇది ఎంతగానో దోహదం చేస్తుందని ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఎస్పీవోసీ తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జ్యూరీలు కె.శ్రీనివాస్‌రావు, జి.శ్రీధర్, వంశీకృష్ణ, రాజు, మహిపాల్, రంజిత్, విద్యార్థుల సమన్వయకర్తలు సందీప్, వివేక్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



వరి పొలం పరిశీలిస్తున్న డీఏవో ఆదిరెడ్డి

రామగుండం: అంతర్గాం మండలంలోని వివిధ గ్రామాల్లో వేసిన వరి పంటను జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి శనివారం పరిశీలించారు. సుడిదోమ, బాక్టీరియా, ఎండుతెగులు వరి పంటను ఆశించిందని ఆయన తెలిపారు. తెగుళ్ల నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అంతర్గాం మండల వ్యవసాయాధికారి కె.సతీశ్, ఏఈవో రమేశ్, పలువురు రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గల్లీకో బెల్ట్‌షాప్

- 24 గంటలపాటు విక్రయాలు
- ఉద్దెరకూ మద్యం లభ్యం
- బానిసలవుతున్న యువత
- దృష్టి సారించని ఎక్సైజ్‌శాఖ
- లైసెన్స్‌దారులకు కల్పతరువు



విద్యుత్ వెలుగుల్లో ఇలా కుర్చీల్లో దర్జాగా కూర్చొని మద్యం తాగుతున్న ఈ చిత్రం జిల్లా కేంద్రంలోని ఓ బెల్ట్‌షాపులోనిది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎనీటైం ఇక్కడ మద్యం లభిస్తోంది. అంతేకాదు.. మద్యం ప్రియులకు నంజుకోవడానికి స్టఫ్ కూడా అందుతోంది. జిల్లాలో ఇలా గల్లీకొకటి ఉంది.

సాక్షి, పెద్దపల్లి: ఎంత రాత్రయినా సరే.. తలుపు తడితే మద్యం సీసా చేతిలో పడుతుంది. ఇలా విచ్చలవిడిగా మద్యం లభ్యం కావడంతో కొందరైతే నిద్ర లేవగానే నేరుగా బెల్ట్‌షాపులకే వరుస కడుతున్నారు. కిక్కు లేనిదే కూలీకి వెళ్లట్లేదు. డబ్బులు లేకపోయినా పర్లేదు. వ్యక్తులను బట్టి నెలకు రూ.5వేల వరకు ఉద్దెరకూ మద్యం దొరుకుతోంది. గల్లీకో బెల్ట్‌షాపులోని పరిస్థితి ఇది. కనీసం వెయ్యి జనాభా లేకున్నా ఒక్కో పల్లెలో కనీసం పదికిపైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. మద్యానికి బానిసలై కొందరు గొడవలకు దిగడం, హత్యలు చేయడం, మరికొందరు ఆత్మహత్యలు చేసుకోవడం తరచూ చోటుచేసుకుంటున్నాయి. కుటుంబ వ్యవస్థ, గ్రామీణ అభివృద్ధిపై తీవ్రప్రభావం చూపే బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత ఎక్సైజ్‌శాఖ అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది. గ్రామాల్లో అశాంతికి కారణమవుతున్న బెల్ట్‌షాపులపై అనేక ఫిర్యాదులు అందుతున్నా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలను అధికార యంత్రాంగం ఎదుర్కొంటోంది.

బార్లను తలపిస్తున్న పర్మిట్‌రూంలు..

నిబంధనల మేరకు పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసుకున్న మద్యం దుకాణ నిర్వాహకులు.. నిల్చొని మద్యం తాగేందుకే ఏర్పాట్లు చేయాలి. వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసిన వ్యక్తి.. పక్కనే ఉన్న పర్మిట్ రూంలో ఇలా మద్యం తాగి అలా వెళ్లిపోవాలి. కానీ బార్ అండ్ రెస్టారెంట్లను తలదన్నేలా పర్మిట్ రూమ్‌లు కొనసాగుతున్నాయి. పదులకొద్దీ టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయడమే కాదు.. మంచినీళ్లు, సోడా, వెజ్, నాన్‌వెజ్ స్నాక్స్, వివిధ రకాల స్టఫ్ అమ్మకాలతో బార్లను తలిపిస్తున్నాయి. అన్నిరకాల ఆహార పదార్థాలు లభిస్తుండటంతో మందుబాబులు అక్కడే తిష్టవేస్తున్నారు. ఫలితంగా కాలనీలు, గల్లీల్లో ప్రశాంతతకు విఘాతం కలుగుతోంది.

వైన్స్‌షాపు నిర్వాహకుల కనుసన్నల్లోనే..

జిల్లాలో 77 మద్యం దుకాణాలు, 16 బార్లు నడుస్తున్నాయి. వీటిలో ఒక్కోదానికి అనుబంధంగా కనీసం మూడు నుంచి పది వరకు బెల్ట్‌షాపులు రన్ చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా సుమారు 1,000కి పైగా బెల్ట్‌షాపులు ఉన్నట్లు అంచనా. విక్రయాల లక్ష్యం కోసం ఎక్సైజ్ అధికారులే దగ్గరుండి మరీ వీటిని ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లోని కిరాణాలు, చిల్లర దుకాణాలు, నివాసాలు.. ఇలా ఎక్కడపడితే అక్కడ మద్యం దందా కొనసాగుతోంది. మద్యం దుకాణాల యాజమాన్యాలకు గ్రామాల్లో నిర్వహించే బెల్ట్ దుకాణాలే ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. దీంతో వాటిని వీరే ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు.

వ్యాపారులే ఏర్పాటు చేయిస్తున్నారు..

వైన్స్ నుంచి నేరుగా కొనుగోలు చేసే వారికి ఎమ్మార్పీకి మద్యం విక్రయించాలి. లేకపోతే ప్రశ్నిస్తారు. ఇలా అయితే గుడ్‌విల్, ఇతర ఖర్చులు పోతే షాపు నిర్వహణ కష్టం. అందుకోసం వ్యాపారులే బెల్ట్‌షాపులు పెట్టించి మరీ విక్రయిస్తున్నారు. ఒక క్వార్టర్ మద్యంపై ఎమ్మార్పీ కంటే రూ.5 నుంచి రూ.10, బీరుపై రూ.10 అధికంగా వసూలు చేస్తున్నారు. షాపుల వద్ద అధిక రేట్లకు మద్యం కొనుగోలు చేస్తున్న బెల్ట్‌షాపుల నిర్వాహకులు.. తమ వద్దకు వచ్చేవారికి క్వార్టర్‌పై రూ.10 నుంచి రూ.20, బీరుపై రూ.20 నుంచి రూ.30 వరకు అధిక ధరతో విక్రయిస్తున్నారు. దీంతో వైన్స్‌షాపు యజమానులు బెల్ట్ షాపులను అడ్డం పెట్టుకొని అధిక మొత్తంలో లాభాలు పొందుతున్నారు. కానీ మద్యం ప్రియులు బెల్ట్‌షాపుల పుణ్యమా అని అధిక ధరలు చెల్లించి తాగి ఇల్లు, ఒళ్లుగుల్ల చేసుకుంటున్నారు. ఇదేవిషయమై ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి వివరణ కోరగా, బెల్ట్ దుకాణాలపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు.. ఎక్కడి నుంచైనా ఫిర్యాదు అందిన వెంటనే దాడులు చేస్తున్నామని ఆయన తెలిపారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లాలో 21,745 కేసుల పరిష్కారం
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి హేమంత్‌కుమార్

పెద్దపల్లిరూరల్: ఇరువర్గాలు లోక్‌అదాలత్‌లో రాజీ కుదుర్చుకుంటే కేసులు సత్వరమే పరిష్కారమవుతాయని, త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన మెగాలోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్‌జడ్జి స్వరూపరాణి, జూనియర్ జడ్జి రాణితో కలిసి ఆయన పాల్గొన్నారు. కేసులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉండకుండా రాజీ కుదుర్చోవడమే మేలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాన్యాయస్థానంతోపాటు అన్ని కోర్టుల్లో నిర్వహించిన లోక్‌అదాలత్‌లలో 21,745 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఏపీపీలు గజ్జి కృష్ణ, వెంకటరమణ, పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు లకిడి భాస్కర్, శ్రీనివాస్, అగ్రికల్చర్ కమర్షియల్ బ్యాంకు మేనేజర్ పవన్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, న్యాయవాదులు హన్మాన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంతోనే పరిష్కారం

ధర్మారం(ధర్మపురి): రాజీమార్గం ద్వారా సమస్యలు పరిష్కరించుకుంటే సమయం, డబ్బులు వృథా కావని జూనియర్ సివిల్ జడ్జి వెంకటసచిన్‌రెడ్డి అన్నారు. నందిమేడారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో జడ్జి పాల్గొని మాట్లాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఆకారి రాజేశం, జాయింట్ సెక్రటరీ నూనే సత్యనారాయణ, లోక్ అదాలత్ సభ్యుడు భీమారపు సంపత్, సీనియర్ ఈసీ సభ్యుడు గద్దం లింగారెడ్డి, న్యాయవాదులు పురాణం సందీప్‌కుమార్, బల్ల సరిత, రజిత, నలిగేటి కల్యాణి, ఎస్సై శీలం లక్ష్మణ్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాచమార్గం..

సుల్తానాబాద్(పెద్దపల్లి): రాజీమార్గమే రాచమార్గమని జూనియర్ సివిల్ జడ్జి గణేశ్ అన్నారు. స్థానిక మున్సిఫ్ కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో జడ్జి మాట్లాడారు. సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్, ఏపీపీ శ్యాంప్రసాద్, ఏజీపీ ఆవుల లక్ష్మీరాజం, లోక్ అదాలత్ సభ్యుడు ఆలూరి శ్రీనివాసరావు, సీఐ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మంథనిలో 360 కేసులు పరిష్కారం

మంథని: స్థానిక కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 360 కేసులు పరిష్కారమయ్యాయి. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మూల స్వాతిగౌడ్, మంథని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తంరెడ్డి, సీఐ రాజు, న్యాయవాదులు భాస్కర్‌రెడ్డి, కటుకం శ్రీనివాస్, బోట్ల ఆంజనేయులు, శశిభూషణ్ కాచే, కన్నూరి హరి, ఎస్సైలు రమేశ్, చంద్రకుమార్, అనిల్, ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ సుభాష్‌బాబు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం

గోదావరిఖనిటౌన్: లోక్ అదాలత్‌లతో సత్వర న్యాయం అందుతుందని అదనపు జిల్లా న్యాయమూర్తి టి.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎన్.మంజుల అన్నారు. అదనపు జిల్లా, మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్‌లో వేర్వేరుగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో వారు పలు సమస్యలు పరిష్కరించి మాట్లాడారు. అసిస్టెంట్ పీపీ నహెడా ఫర్వీన్, ఏసీపీ రమేశ్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్‌కుమార్, ప్రసాదరావుతోపాటు గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్, న్యాయవాదులు కిషన్‌రావు, సీహెచ్ శైలజ, పెట్టెం శ్రీనివాస్, పుర్మ శ్రీనివాస్, ముచ్చకుర్తి కుమార్, లోక్ అదాలత్ సభ్యులు ప్రకాశ్, ప్రదీప్ కుమార్, నూతి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

- చిన్నారుల ఎదుగుదలపై దృష్టి
- గర్భిణులు, బాలింతలకు అవగాహన
- కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే విజయరమణారావు
- ఘనంగా పోషణ్ మహా కార్యక్రమం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు

పెద్దపల్లిరూరల్: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోషణ్ మహా జిల్లాస్థాయి కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలు, రక్తహీనతను అధిగమించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను జిల్లా సంక్షేమ అధికారి రవుఫ్‌ఖాన్, మహిళా కమిషన్ సభ్యురాలు రేవతిరావు తదితరులు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను లబ్ధిదారులకు నిర్ణీత సమయాల్లోనే సక్రమంగా అందించాలని సూచించారు. పోషణ్ మహా మాసోత్సవం సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్ల స్వరూప, సీడీపీవో కవితతోపాటు టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువులకు నాణ్యమైన సేవలు

జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో నవజాత శిశువులకు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చేందుకు దాదాపు రూ.30లక్షలతో పరికరాలను సమకూర్చుతున్నామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సోషల్ ఇంపాక్ట్ గ్రూపు డైరెక్టర్ అర్చన సురేశ్‌తో కలిసి కలెక్టర్ స్థానిక ఆస్పత్రిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈడీ ప్రీతి, మేనేజర్ మేరీ, నల్ల ఫౌండేషన్ ప్రతినిధి నల్ల మనోహర్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్, ఆర్ఎంవో రవీందర్, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి..

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్ ఇంజినీరింగ్ అధికారులతో పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని రహదారుల మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు. అంగన్‌వాడీల్లో టాయిలెట్ల నిర్మాణాలు పూర్తికావాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు అనిత, గిరీశ్‌బాబు, భావ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల మల్లన్న ఆలయ అభివృద్ధి లక్ష్యం



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల(పెద్దపల్లి): ఉత్తర తెలంగాణ భక్తులకు తలమానికమైన ఓదెల శ్రీమల్లికార్జునస్వామి ఆలయ అభివృద్ధి తమ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మదనపోశమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆలయ అభివృద్ధి గురించి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆలయం నుంచి పెగడపల్లి వరకు, ఆలయం చుట్టూ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని వెల్లడించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్, వైస్ చైర్మన్ బత్తుల రమేశ్‌బాబు, ఈవో సుధాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, యాదవ సంఘం నాయకుడు తమ్మెడబోయిన ఓదెలు యాదవ్ పాల్గొన్నారు. కాగా, ఇటీవల అర్చకరత్న అవార్డు అందుకున్న అర్చకుడు ఆరుట్ల నరసింహాచార్యను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.

Festival Special

2 నుంచి తొమ్మిది రోజుల పండుగ
ఊరూవాడా తరుణి సందడి
ఎంగిలిపూలతో మొదలై
సద్దులతో ముగియనున్న బతుకమ్మ
ఆటపాటలతో సందడి చేయనున్న ఆడబిడ్డలు

'తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ.. ఈ పండుగ వచ్చిందంటే పల్లె, పట్టణం తేడా లేకుండా పూల పరిమళాలు వెదజల్లుతాయి.. గునుగు, తంగేడు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గోరింట.. ఇలా తీరొక్క పువ్వు బతుకమ్మను ఆహ్వానిస్తుంది.. పూల పూజకు వేళైంది.. బుధవారం నుంచి ఎంగిలిపూలు మొదలు సద్దుల వరకు ఆడబిడ్డలు తొమ్మిది రోజులపాటు బతుకమ్మను ఆటపాటలతో కొలుస్తారు. పంటలు, పిల్లాజెల్లా, గొడ్డుగోదా బాగుండాలని కోరుకుంటారు.'



పూల జాతరకు వేళాయె

విద్యానగర్(కరీంనగర్):

ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పూల పండుగ బతుకమ్మ. ఆడబిడ్డలకు ఎంతో ఇష్టం. మహిళలు అత్తింటి నుంచి పుట్టింటికి చేరుకుంటారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలను సేకరించి, బతుకమ్మను పేర్చి, గౌరమ్మను పూజిస్తారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సందడి వాతావరణం నెలకొననుంది. వీధులన్నీ పాటలతో హోరెత్తనున్నాయి. పూలు, దుస్తుల కొనుగోలుతో మార్కెట్లు, వస్త్ర దుకాణాలు కళకళలాడనున్నాయి.

ఒక్కో రోజు ఒక్కో పేరుతో..

తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అంటారు. ముందురోజు కోసిన పూలను నీళ్లలో వేసి, మరునాడు అలంకరణకు వాడటం వల్ల ఇలా పిలుస్తారు. రెండో రోజు అటుకుల, మూడో రోజు ముద్దపప్పు, నాలుగో రోజు నానబియ్యం, అయిదో రోజు అట్ల, ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటారు. ఆరో రోజు అమ్మవారు అలకలో ఉంటుందని నమ్మి, బతుకమ్మ ఆడరు. ఏడోరోజు వేపకాయల, ఎనిమిదో రోజు వెన్నముద్దల, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ అంటారు. చివరి రోజు ఆడబిడ్డలు ఆడిపాడి, పోయిరా బతుకమ్మ పోయిరావమ్మా.. మళ్లొచ్చే ఏడాది తిరిగి రావమ్మా.. అని వీడ్కోలు పలుకుతారు. నీళ్లలో నిమజ్జనం చేశాక.. వాయినం ఇచ్చిపుచ్చుకుంటారు.


అన్నలతో కలిసి పూలు తెచ్చేదాన్ని



ఇంట్లో నేను ఒక్కదాన్నే ఆడపిల్లను. బతుకమ్మ వస్తే ఇద్దరు అన్నలతో కలిసి పొలాల వెంట తిరుగుతూ పూలు తెచ్చేదాన్ని. గుమ్మడి, తంగేడు, కట్ల, గోరింట, సీతమ్మ జడలు, గునుగు వంటి పూలు, గుమ్మడి ఆకులతో అమ్మ బతుకమ్మ పేర్చేది. నా ఈడోళ్లతో ఆడిపాడుతుంటే సంబురంగా అనిపించేది. నాకు ఐదుగురు ఆడపిల్లలు, వారికి ఎనిమిది మంది ఆడపిల్లలు. బతుకమ్మకు అందరూ ఇంటికి వస్తరు.

– గండె అమృతమ్మ, హరిహరనగర్, కరీంనగర్

లంగా ఓణీలు కనిపిస్తలేవు



సిరిసిల్ల కల్చరల్: మా చిన్నప్పటి బతుకమ్మకు ఇప్పుడు ఆడుతున్న బతుకమ్మకు పోలికే లేదు. అప్పట్లో ఒకే వీధిలో ఉన్న ఆడపిల్లలందరం సాయంత్రం చిన్న కూడలికి చేరేవాళ్లం. ఓ పెద్దావిడ మాత్రం ఏమాత్రం అలసిపోకుండా పాడుతూ అందరినీ ఆటలో భాగస్వామ్యం చేసేది. లంగా ఓణీలు, గౌన్‌లు వేసుకున్నవారే కనిపించేవారు. ఇప్పుడు కనిపిస్తలేరు. సౌండ్ బాక్సుల్లో వచ్చే పాటకు, బతుకమ్మకు ఏం సంబంధమో అర్థం కావడం లేదు.

– రాపెల్లి అరుణ, మున్సిపల్ కౌన్సిలర్, సిరిసిల్ల

పాత పాటలు ఇప్పటోళ్లకు నచ్చట్లేదు



మా అమ్మవాళ్ల ఊరు పర్లపల్లి. మేము ముగ్గురు అన్నలు, ఐదుగురం అక్కాచెల్లెళ్లం. రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చుతుంటే మా ఇంట్లో సందడిగా ఉండేది. అందరం కలిసి ఆడిపాడేవాళ్లం. అందరికీ పెళ్లిళ్లయ్యాక ఒక్కచోట కలవడం కుదరడం లేదు. కానీ, ఏటా బతుకమ్మకు మా ఊరెళ్లి, నేనే పాటలు పాడుతున్న. పాత పాటలు ఇప్పటోళ్లకు నచ్చట్లేదు. మైకులు, డీజేలు పెడుతున్నరు.

– చిట్టుమల్ల స్వర్ణలత, చైతన్యపురి, కరీంనగర్

పాటలు పాడేవారు లేరు



జూలపల్లి(పెద్దపల్లి): అప్పట్లో బతుకమ్మ పాటలు పాడేందుకు చాలామంది ముందుకు వచ్చేవారు. మగవాళ్లు గునుగు, తంగేడు, ఇతర పూలు తెచ్చేవారు. ఇప్పుడు ఎవరో పాడిన పాటలు పెట్టి, కోలాటం ఆడటం, చప్పట్లు కొట్టడం తప్ప పాటలు పాడేవారు లేరు. తెలంగాణ వచ్చినంక బతుకమ్మకు పేరొచ్చినా, నాటి పాటలు, సంస్కృతిని మరిచిపోతుండటం బాధగా ఉంది.

– అమరగాని ఈశ్వరమ్మ, జూలపల్లి

ఇంటి దేవతగా కొలుస్తాం..



తిమ్మాపూర్: తెలంగాణ పండుగ బతుకమ్మ. బొడ్డెమ్మ మొదలు సద్దుల బతుకమ్మ వరకు రోజుకో ప్రత్యేకత ఉంది. బతుకమ్మను ఇంటి దేవతగా కొలుస్తాం. నా చిన్నప్పటి నుంచి మా ఇంట్లో అమ్మమ్మ, అమ్మ అక్కలతో కలిసి బతుకమ్మను అలరించడం అందులో నైపుణ్యాన్ని ప్రదర్శించడం చాలా సంతోషంగా ఉంటుంది. పోటాపోటీగా బతుకమ్మను పేరుస్తాం. ఈ పండుగ మనకు నైతిక విలువలు కూడా అలవాటు చేస్తుంది.

– దుర్శెట్టి హరిణి, ఎస్సార్ కళాశాల, కురిక్యాల

పువ్వులను కీర్తిస్తూ..



బతుకమ్మ పాటల్లో కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి వుంటుంది. రకరకాల పువ్వులు రంగు రంగులలో పూసి ఉంటాయి. వీటిలో గునుగు పూలు, తంగేడు పూలు బాగా ఎక్కువగా పూస్తాయి. బంతి, చామంతి, పూలకు కూడా ఇదే సమయం. ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగురంగుల పువ్వులతో కీర్తిస్తూ పండుగను జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ తెలంగాణలో సౌందర్యం,ఆత్మగౌరవం పెంపొందిస్తుంది.

–ఎం.శ్రీయ, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల, తిమ్మాపూర్

ఆడబిడ్డల పండుగ



బతుకమ్మ పూల పండుగ, ఆడబిడ్డల పండుగ. ఊరంతా సందడిగా ఉంటుంది. తొమ్మిది రోజులు రోజొక్క పేరుతో ఆడుతం. ఎక్కడ ఉన్నా..బతుకమ్మ పండుగకి సొంత ఊరికి వెళ్తాం. ఈ పండుగ ప్రకృతిని, దేవుడిని పూజించడంతోపాటు చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచిస్తుంది. బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకంగా ఉండడం మా అదృష్టం.

– మణిదీప్తి, ఎస్సార్ కళాశాల, కరీంనగర్



క్లుప్తంగా

గుండెపోటుతో అంగన్‌వాడీ టీచర్ మృతి


శంకరవ్వ (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని చిన్నలింగాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ గంగాపురం శంకరవ్వ(55) శనివారం గుండెపోటుతో మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. శంకరవ్వ రోజూ మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి పిల్లలను చూసుకుంటోంది. ఆ తర్వాత మండలంలోని నేరెళ్ల పీహెచ్‌సీలో జరిగిన సమావేశానికి హాజరై తిరిగి వెళ్తుండగా పీహెచ్‌సీకి సమీపంలో గుండెపోటుతో కుప్పకూలింది. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందిందని తెలిపారు. ప్రభుత్వం తరఫున జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం రూ.50వేల చెక్కును మృతురాలి తమ్ముడు పోశయ్యకు అందజేశారు.

విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతూ రైతు..


భూమయ్య (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని దీకొండ గ్రామానికి చెందిన రైతు తాడూరి చిన్నభూమయ్య (60) పక్షం రోజుల క్రితం విద్యుత్ షాక్‌తో గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై రవికిరణ్ వివరాల ప్రకారం.. భూమయ్య తన పొలం వద్ద సాగు చేసిన కందిపంటను అడవి పందుల నుంచి కాపాడుకునేందుకు ఈ నెల 10న, రాత్రి సమయంలో చేను చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. మరుసటి రోజు చేను వద్దకెళ్లిన భూమయ్య తాను అమర్చిన విద్యుత్ తీగలు తొలగించే క్రమంలో ప్రమాదవశాత్తు షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు వరంగల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'ఎస్సైపై చర్యలు తీసుకోవాలి'

సిరిసిల్లక్రైం: కేసుతో సంబంధం లేని వ్యక్తులను వేధింపుల గురిచేస్తున్న బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలని గంగాధర మండలం నీలోజుపల్లికి చెందిన సింగిరెడ్డి రమ డిమాండ్ చేసింది. ఈమేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేసినట్లు మీడియాకు తెలిపింది. గ్రామంలో ఓ డ్రైవర్‌పై దాడి చేసినట్టు తప్పుడు కేసు నమోదు చేసి తన కొడుకు వెంకటేశ్‌తోపాటు అల్లుడు పూస శ్రీనివాస్‌రెడ్డిపై తప్పుడు కేసులు నమోదు చేసినట్లు రమ ఆరోపించారు. కరీంనగర్‌లో నివసించే వ్యక్తిని బోయినపల్లి స్టేషన్ పరిధిలో ఉన్నట్లు తప్పుడు సమాచారం పెడుతూ జైలుకు పంపినట్లు ఆరోపించారు. కుటుంబంలో కలతలు పెరగడంతో మనస్థాపానికి గురై వెంకటేశ్ పురుగుల మందు తాగి, ప్రస్తుతం ఎల్లారెడ్డిపేటలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. తప్పుడు కేసు నమోదు చేసిన బోయినపల్లి ఎస్సైపై చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు రమ పేర్కొన్నారు.

యువత గుండెకు ముప్పు

- పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధులు
- ఉన్నట్టుండి కుప్పకూలుతున్న వైనం
- మానసిక ఒత్తిడే కారణమంటున్న వైద్యులు
- యోగా, నడక, వైద్య పరీక్షలు అవసరమని సూచన

నేడు వరల్డ్ హార్ట్ డే



కరీంనగర్ టౌన్: మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన గుండె పదిలంగా ఉండాలి. ఒకప్పుడు గుండెపోటు రావడం చాలా అరుదు. వయసు మీద పడిన వారికి మాత్రమే వచ్చేది. ఇప్పుడు చిన్నాపెద్ద తేడా లేకుండా అందరికీ వస్తోంది. డ్యాన్స్ చేస్తూ, గేమ్స్ ఆడుతూ, వ్యాయామం చేస్తూ ఉన్నట్టుండి కుప్పకూలుతున్నారు. గుండెపోటుతో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది చనిపోతున్నారని సర్వేలు చెబుతున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గుండె జబ్బులు వస్తున్నవారి సంఖ్య వేలల్లో ఉంటోంది. మారుతున్న జీవన శైలి, ఒత్తిడి, ఆహారపు అలవాట్లతో యువతలో గుండె జబ్బు బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతోందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అందుకే గుండెను ఫిట్‌గా ఉంచాలని సూచిస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబర్ 29న ప్రపంచ గుండె దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో గుండె వ్యాధుల బాధితులు

ఏడాది	30-50 ఏళ్లు	50 ఏళ్లపైన	మొత్తం
2023	2,300	3,400	5,700
2024	1,760	2,640	4,400

నిద్రపోతున్నప్పుడు ఎందుకు వస్తుంది?

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నిద్రపోతున్నప్పుడు గుండెపోటు రావడానికి ప్రధాన కారణం.. గుండె ప్రధాన సిరలలో ఒకటి పూర్తిగా బ్లాక్ అవవడం. లేదా దానిలో ఏదైనా అడ్డంకి కావొచ్చు. ఈ అడ్డంకికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి కొలెస్ట్రాల్ బాగా పేరుకుపోవడం. రెండోది రక్తం గడ్డకట్టడం. ఇది తాత్కాలికంగా సంభవిస్తుంది. కానీ కొలెస్ట్రాల్ ఎప్పటినుంచో ఉంటుంది. సాధారణంగా గుండెపోటు రక్తం గడ్డకట్టడం వల్ల ఏ సమయంలోనైనా రావొచ్చు.

గుండెపోటుకు ప్రధాన కారణాలు

అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ లెవెల్స్ పెరగడం, అధిక చక్కెర స్థాయిలు, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, ఎప్పుడూ ఒత్తిడికి లోనవడం. అయితే, గుండెపోటుకు దారితీసే ఈ కారణాలన్నింటినీ చాలా వరకు నియంత్రించవచ్చని డాక్టర్లు అంటున్నారు. వృద్ధాప్యం, లింగ ఆధారిత (ఆడవారి కంటే మగవారికే ఎక్కువగా గుండెపోటు వస్తుంది), వంశపారంపర్యంగా వచ్చేవాటిని మాత్రం నియంత్రించలేమని చెబుతున్నారు.

లక్షణాలు ఇవీ..

ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఆందోళన, హృదయ స్పందన పెరగడం, మూర్ఛ, మాట్లాడటంలో ఇబ్బంది, విపరీతంగా చెమటలు పట్టడం వంటివి గుండెపోటు లక్షణాలు. అయితే, నొప్పి ఎడమ చాతి వైపు మాత్రమేనని ఉంటుందని చాలా మంది అనుకుంటారు. కానీ, గుండెపోటు నొప్పి ఛాతిలోనే కాదు మన దవడ నుంచి నాభి వరకు ఎక్కడైనా రావొచ్చు. తర్వాత అది భుజాలు, చేతులు, ఎగువ వీపు వరకు పాకుతుంది.

నివారణ చిట్కాలు..

- బరువు పెరగకుండా జాగ్రత్త పడాలి. ప్రతీరోజు 7 నుంచి 8 గంటలు కచ్చితంగా నిద్రపోవాలి.
- క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకోవాలి. తీయని లేదా వేయించిన ఆహార పదార్థాలను ఎక్కువగా తినకూడదు.
- స్మోకింగ్, ఆల్కహాల్ అలవాట్లకు దూరంగా ఉండాలి.
- రెగ్యులర్గా వ్యాయామం చేయాలి.
- బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ టెస్టులు చేయించుకోవాలి.

నిర్లక్ష్యం చేయొద్దు



రక్తనాళాలు మూసుకుపోయి రక్త సరఫరా తగ్గిపోవడం వల్లే గుండెలో నొప్పి వస్తుంది. దీన్ని గ్యాస్ట్రిక్ సమస్య అనుకుంటూ నిర్లక్ష్యం చేయొద్దు. ఛాతిలో బరువుగా అనిపించడం, వీపు వెనక భాగంలో నొప్పి రావడం, ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు పట్టడం వంటివి జరుగుతాయి. ఈ లక్షణాలు ఉంటే వెంటనే ఆస్పత్రికి వెళ్తే గోల్డెన్ అవర్‌లోనే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది.

– కొండపాక కిరణ్, కార్డియాలజిస్టు, మెడికవర్ ఆస్పత్రి, కరీంనగర్

ప్రజలకు అవగాహన కల్పించాలి


మాట్లడుతున్న సుజాత

హృదయ సంబంధిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కరీంనగర్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని, శనివారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. డయాబెటిస్, హైపర్‌టెన్షన్‌కు సంబంధించిన టెస్టులు చేయించుకోవాలన్నారు. ప్రతీరోజు ఫిజికల్ యాక్టివిటీస్‌లో భాగంగా ఉదయపు నడక, పండ్లు, కూరగాయలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్యానికి కారణమయ్యే ధూమపానం, పొగాకు నమలడం, ప్యాకేజీ ఫుడ్స్, ఎక్కువ శాతం ఉప్పు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఐవో డాక్టర్ సాజీదా అతహరీ, డాక్టర్ రాజగోపాల్, వెంకటేశ్వర్లు, కైక, హెల్త్ ఎడ్యుకేటర్లు, డీపీవో స్వామి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాయామం చేయాలి



ఫాస్ట్‌ఫుడ్స్, జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడం, వ్యాయామం లేకపోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. తెలియకుండానే శరీరంలో కొలెస్ట్రాల్ అధిక స్థాయిలో పెరిగి, రక్తంలో బ్లాక్స్ ఏర్పడతాయి. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె, మెదడు స్ట్రోక్ వస్తాయి. ప్రతీరోజు 45 నిమిషాల పాటు నడక లేదా వ్యాయామం చేస్తే గుండె సంబంధిత సమస్యలు దూరమవుతాయి.

– డాక్టర్ మల్లెల రాజేంద్రప్రసాద్, కార్డియో థొరాసిక్ అండ్ వాస్కులర్ సర్జన్

శ్రీధర్‌బాబు కృషితోనే లాభాల్లో వాటా

- రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్


మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

రామగిరి(మంథని): రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కృషితోనే సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా దక్కిందని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఓసీపీ–2లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి చరిత్రలో తొలిసారి మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో కాంట్రాక్టు కార్మికులకు రూ.5,000 లాభాల వాటా దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్మికుల పక్షపాతిగా ఉంటోందని తెలిపారు. వారి సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అనంతరం వివిధ యూనియన్‌లకు చెందిన 100 మంది కాంట్రాక్టు కార్మికులు ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి జనక్‌ప్రసాద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ధర్మపురి, వికాస్ కుమార్ యాదవ్, రామిండ్ల మనోహర్, ఉడుత శంకర్ యాదవ్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీలో చేరిన సర్వేయర్లు

గోదావరిఖని: రామగుండం రీజియన్‌లోని సర్వేయర్లు ఐఎన్‌టీయూసీలో చేరారు. వీరికి యూనియన్ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీలో చేరిన వారిలో సర్వేయర్లు గణేశ్, రాము, తిరుపతి, సతీశ్, శ్రీధర్, బాబు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి, దాస్, వికాస్ కుమార్, శంకర్‌నాయక్, సదానందం, కొత్త సత్యనారాయణరెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు


మాట్లాడుతున్న మంద నర్సింహారావు

గోదావరిఖని: గత ఆర్థిక సంవత్సరంలో సింగరేణి యాజమాన్యం సాధించిన వాస్తవ లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు డిమాండ్ చేశారు. శనివారం ఆర్జీ–1 ఏరియా జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. లాభాల గణాంకాలపై కార్మికులు అయోమయంలో ఉన్నారని తెలిపారు. ట్యాక్స్‌కు ముందు ట్యాక్స్ తర్వాత సంస్థ లాభం ఎంత అనేది తెలియజేయాలన్నారు. ప్రతిపక్షంలో ఉండగా 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని డిమాండ్ చేసి, అధికారంలోకి రాగానే ప్రభుత్వం చెప్పిన మాటలకు గంగిరెద్దులా తలూపుతూ కేవలం 33 శాతానికి ఒప్పుకొన్నారని విమర్శించారు. వచ్చిన లాభాల నుంచి సగం సంస్థ అభివృద్ధి కోసం పక్కన పెడుతున్నామని చెబుతున్న గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాల నాయకులు.. సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావలసిన రూ.30 వేల కోట్ల బకాయిలపై ఎందుకు ప్రశ్నించడంలేదని ఆయన నిలదీశారు. సమావేశంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, తోట నరహరిరావు, ఎస్‌కేగౌస్, వంగల రామన్న, పి.శ్రీనివాసరావు, ఎ.శంకరన్న, పి.సమ్మయ్య, భీమానాయక్, శివరామరెడ్డి, జంగాపల్లి మల్లేశ్, ఈదుల సాగర్, కొండపల్లి కృష్ణ, బొంకూరు సురేశ్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గం


కార్యవర్గాన్ని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికలు నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా సీహెచ్ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా జూపాక శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా ఎన్.నర్మద, కోశాధికారిగా జి.గీతావాణి, మహిళా విభాగం కార్యదర్శిగా ఎ.మాధవీలత, స్టేట్ కౌన్సిలర్లుగా కె.శ్రీనివాస్, ఎస్.నిర్మల ఎన్నికయ్యారు. ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం ఎన్నికల అధికారిగా, ప్రత్యేకాధికారులుగా కె.రవీందర్‌రెడ్డి, ఎం.మహేందర్ కుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కల్పన శాలువాతో సన్మానించారు.

మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న పిడమర్తి రవి

పెద్దపల్లిరూరల్: మాదిగలకు 12శాతం రిజర్వేషన్లను వర్తింపజేయాలని కాంగ్రెస్ నాయకుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు రిజర్వేషన్ల వర్తింపులో అన్యాయం జరగకుండా 'మేలుకొలుపు' యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాదిగలంతా ఐక్యంగా ఉంటూ రిజర్వేషన్లను సాధించుకుందామని అన్నారు. అంతకుముందు బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సమావేశంలో నాయకులు ఊట్ల వరప్రసాద్, పాపయ్య, బొంకూరి అవినాష్, లక్ష్మణ్, వరప్రదీప్, చిలుక రాజేశ్, అక్కపాక సంపత్‌కుమార్, బూడిద శంకర్, ఆనంద్, తిరుపతి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు విచారణతో మనస్తాపం.. వ్యక్తి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వినోద్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పోలీసు విచారణతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చెప్యాల మొండమ్మ అనే వితంతుకు చెందిన స్థలంలో అదే గ్రామానికి చెందిన చెప్యాల స్వామి ప్రహరీ నిర్మాణం చేపట్టాడు. ఈవిషయంపై బాధితురాలు శనివారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై వెంకటేశ్.. చెప్యాల స్వామిని ఠాణాకు రావాలని సమాచారం పంపించారు. ఈక్రమంలో స్వామి తన కుమారుడు వినోద్‌ను వెంట తీసుకుని పోలీసుస్టేషనుకు వెళ్లాడు. అయితే, ప్రహరీ విషయంపై ఎస్సై.. స్వామిని సప్రశ్నించారు. తనకు కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ ఉందని స్వామి తెలిపాడు. అయితే, కోర్టు నుంచి తీర్పు వచ్చేదాకా ఓపిక పట్టాలని, గొడవలు పెట్టుకోవద్దని ఎస్సై సూచించి ఠాణా నుంచి ఇంటికి పంపించారు. తమను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారని మనస్తాపం చెందిన వినోద్ తన పొలం వద్దకు వెళ్లి పురుగులమందు తాగాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈవిషయమై ఎస్సై వెంకటేశ్‌ను సంప్రదించగా.. మొండమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేసి కోర్టు తీర్పు వచ్చేవరకు వేచిచూడాలని చెప్పి, ఇంటికి పంపించామన్నారు. ఆత్మహత్యాయత్నంపై విచారణ జరుపుతున్నామని ఎస్సై వివరించారు.

గౌరవెల్లికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయండి

కరీంనగర్: శ్రీరాంసాగర్ వరద కాలువ– గౌరవెల్లి రిజర్వాయర్, కెనాల్స్ పనులు పూర్తి చేసేందుకు రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయాలని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శనివారం సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి లేఖ రాశారు. హుస్నాబాద్, భీమదేవరపల్లి, గంగాధర, సిరిసిల్ల మెట్టప్రాంతాలకు ఎత్తిపోతల ద్వారా సాగు, తాగునీరు అందించాలనే పోరాటం 1980 నుంచి ప్రారంభించడం జరిగిందన్నారు. ఆ ఉద్యమ ప్రాధాన్యతను గుర్తించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జనగామలో జరిగిన బహిరంగ సభలో శ్రీరాంసాగర్ బ్యాక్ వాటర్ నుంచి కాల్వ ద్వారా మెట్ట ప్రాంతాలకు సాగునీరు అందిస్తామని ప్రకటించినట్లు గుర్తుచేశారు. తర్వాత 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం ఉన్నప్పుడు జలయజ్ఞం చేపట్టి వరద కాలువకు ఇందిరా కాలువగా నామకరణం చేశారని, గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి లిఫ్ట్ కెనాల్, కెనాల్స్‌కు 2007లో శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేయాలని లేఖలో కోరారు.

కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య


పోచయ్య (ఫైల్)

మానకొండూర్: కుటుంబ కలహాల కారణంగా భర్తను భార్య హతమార్చిన ఘటన శుక్రవారం రాత్రి మానకొండూర్ మండల కేంద్రంలో జరిగింది. గ్రామస్తులు, ఇన్‌చార్జి సీఐ స్వామి తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మోటం పోచయ్య (45), అతడి భార్య సమ్మక్క గ్రామాల్లో తిరుగుతూ పాత ఇనుప సామగ్రి సేకరించి అవి అమ్ముకోగా వచ్చిన డబ్బులతో జీవనం సాగించేవారు. వీరికి ఒక కూతురు ఉండగా ఆమెకు వివాహం చేశారు. అయితే తరచూ వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. పలు మార్లు కుల పెద్దలు సర్ది చెప్పారు. అయినా వారి మధ్య గొడవలు జరుగుతూనే ఉన్నాయి. కాగా శుక్రవారం రాత్రి సైతం ఇంట్లో వీరిద్దరి మధ్య మాట మాట పెరిగి గొడవ జరిగింది. ఈక్రమంలో కోపోద్రిక్తురాలైన సమ్మక్క తన భర్తను రోకలిబండతో తల, చేతులు, కడుపులో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితురాలిని అరెస్ట్ చేశామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వస్త్రవ్యాపార దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి.. చికిత్స పొందుతున్న భార్య
- వ్యాపారంలో నష్టం, అప్పులే కారణం
- భూమి కొని నష్టపోయిన వ్యాపారి


సామల రమేశ్

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వస్త్రవ్యాపారి దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సిరిసిల్లలో సంచలనం రేపింది. భర్త మృతిచెందగా, భార్య ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. స్థానికులు తెలిపిన వివరాలు. సిరిసిల్లకు చెందిన వస్త్రవ్యాపారి, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సామల రమేశ్(51) వ్యాపారంలో నష్టాలు, భూమి కొనుగోలు వ్యవహారంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక మానసిక వేదనకు గురై శనివారం సాయంత్రం దంపతులు ఇద్దరు ఇంట్లోని డైయింగ్‌లో వాడే నైట్రేట్ అనే రసాయనాన్ని సేవించారు. స్థానికులు గమనించి సిరిసిల్ల ఆస్పత్రికి తరలించగా.. రమేశ్ మృతిచెందాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రమేశ్ భార్య లావణ్యను ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై సిరిసిల్ల టౌన్ ఎస్సై శ్రీనివాస్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులమత గోడలను తొలగించిన కవి జాషువా


మాట్లాడుతున్న నలిమెల భాస్కర్

కరీంనగర్‌కల్చరల్: దేశంలో కుల, మత గోడలను తన కవిత్వంతో బద్దలుకొట్టిన మహా కవి జాషువా అని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. శనివారం గుర్రం జాషువా 129వ జయంతి సందర్భంగా తెలంగాణ సాహితీ కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సప్తగిరికాలనీలో నిర్వహించిన కవి సమ్మేళనంలో మాట్లాడారు. జాషువా రాసిన గబ్బిలం, ఫిరదౌసి నవలలను ప్రతీ ఒక్కరు చదవాలన్నారు. కవులు తమ కవితా గానం చేశారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మనువాడ శంకర్, కవులు బూర్ల వెంకటేశ్వర్లు, బొద్దుల లక్ష్మయ్య, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, వైరాగ్యం ప్రభాకర్, నాగరాజు, పురుషోత్తం సతీష్ తదితరులున్నారు.


జాషువా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కవులు

తెరవే ఆధ్వర్యంలో...

కరీంనగర్‌కల్చరల్: తెలుగు సాహిత్యానికి దళిత చైతన్య స్ఫూర్తిని అందించిన వైతాళికుడు గుర్రం జాషువా అని తెలంగాణ రచయితల వేదిక (తెరవే) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జ్యోతిబాపూలే మైదానంలో తెరవే ఆధ్వర్యంలో జరిగిన జాషువా జయంతిలో ఆయన మాట్లాడారు. పీడితుల వేదనను మెత్తటి అధిక్షేపంతో జాషువా అక్షరీకరించారని పేర్కొన్నారు. తెరవే జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, కవులు నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్, గుండు రమణయ్య, యుగేందర్, బాలసాని కొమరయ్య, ఎం.మహేందర్, సత్యనారాయణరాజు, అరుణ్ పాల్గొన్నారు.